సాక్షి
ఖమ్మం
శుక్రవారం ၊ 18 ၊ అక్టోబర్ ၊ 2024


అందుబాటులోకి పాత వంతెన
ఖమ్మంలోని ప్రకాశ్‌నగర్ హైలెవల్ వంతెన మరమ్మతులు పూర్తయ్యే వరకు రాకపోకల కోసం లోలెవల్ వంతెనను సిద్ధం చేశారు. 8లో


లాభసాటి సాగు..
ఎంబీఏ పూర్తిచేసిన యువకుడు ఓ పక్క కూరగాయల సాగు చేస్తూనే చేపలు, నాటుకోళ్ల పెంపకంలో రాణిస్తున్నాడు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 24°
వాతావరణం
జిల్లాలో శుక్రవారం ఉదయం ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. ఆతర్వాత ఎండ మొదలై మధ్యాహ్నానికి మరింత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

129 మంది ఏఈఓలకు మెమోల జారీ
ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగిస్తామని హెచ్చరిక


డీఏఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏఈఓలు

నేలకొండపల్లి: పంటల డిజిటల్ సర్వే ప్రారంభించకపోవడంతో జిల్లాలోని వ్యవసాయ విస్తరణ అధికారుల(ఏఈఓ)లకు ఉన్నతాధికారులు మెమోలు జారీ చేశారు. జిల్లాలో పంటల డిజిటల్ సర్వే చేయాలని సూచించగా.. పనిభారం కారణంగా తాము చేయలేమని, సహాయకులను కేటాయించాలని ఏఈఓలు నిరసన తెలుపుతున్నారు. ఈమేరకు జిల్లాలో 129 మంది ఏఈఓలకు ఈనెల 14వ తేదీన అధికారులు మెమోలు జారీ చేశారు. అంతేకాక ఔట్ సోర్సింగ్ ఏఈఓలు 16మంది, ఆత్మ సిబ్బంది ఐదుగురికి కూడా మెమోలు జారీ చేసిన అధికారులు వెంటనే సర్వే మొదలుపెట్టకపోతే ఉద్యోగం నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. అయితే, ఇప్పటివరకు కూడా జిల్లాలో సర్వే మొదలుపెట్టలేదు. ఈ నేపథ్యాన ఔట్ సోర్సింగ్ సిబ్బందికి అండగా నిలిచిన ఏఈఓలు గురువారం నిరసన తెలిపి జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్యకు వినతిపత్రం అందించారు. ఏఈఓల జేఏసీ అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా మాట్లాడుతూ పిచ్చుకలపై బ్రహ్మాస్త్రం మాదిరి ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు తొలగిస్తామని హెచ్చరించడం సరికాదన్నారు.

నేడు కొత్త టీచర్లతో కలెక్టర్ ముఖాముఖి
ఖమ్మం సహకారనగర్: డీఎస్సీ–2024 ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు తాజాగా విధుల్లో చేరారు. వీరితో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శుక్రవారం ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ముఖాముఖి సమావేశమై మార్గదర్శనం చేయనున్నారు. ఈ మేరకు నూతన ఉపాధ్యాయులంతా ఉదయం 10గంటల్లోపు కళాక్షేత్రానికి చేరుకోవాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు.

వాక్ వేలను సందర్శించిన కమిషనర్


ఎన్నెస్పీ కెనాల్ వాక్ వేను పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలోని లకారం ట్యాంక్‌బండ్, మినీ లకారం, ఎన్నెస్పీ కెనాల్, ఖానాపురం చెరువుల వాక్‌వేలను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య గురువారం పరిశీలించారు. వాక్‌వేలకు ఇరువైపులా ఫెన్సింగ్, మొక్కలను పరిశీలించిన ఆయన వాకర్లకు అనువుగా ట్రాక్‌లను సిద్ధం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే, ఓపెన్ జిమ్‌ల్లో పాడైన పరికరాలను మరమ్మతులు చేయించాలని, ఫెన్సింగ్ తొలగించే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్, ఈఈ కృష్ణాలాల్ తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్యలో ప్రవేశాలకు 30వరకు అవకాశం
ఖమ్మం సహకారనగర్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(గతంలో ఎస్డీఎల్‌సీఈ) డిగ్రీ, పీజీ, డిప్లమా కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 30వ తేదీ వరకు గడువు పొడిగించారు. ఈ విషయాన్ని యూనివర్సిటీ పీజీ కళాశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ గోపి తెలిపారు. బీఏ, బీకాం జనరల్, కంప్యూటర్స్, బీబీఏ, బీఎస్సీ మ్యాథ్స్, బ్యాచలర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్‌తో పాటు పీజీతో కలిపి 43 కోర్సుల ప్రవేశాలకు అవకాశముందని వెల్లడించారు. దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో స్వీకరిస్తామని, వివరాలకు 98492 50633, 80088 11998 నంబర్లలో లేదా kusdlce. co. in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

డిగ్రీ కళాశాలల బంద్ విరమణ
ఖమ్మం సహకారనగర్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తామని రాష్ట్రప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చిందని కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. ఈ మేరకు కళాశాలల నిరవధిక బంద్‌ను విరమిస్తున్నట్లు వెల్లడించారు. కళాశాలలు శుక్రవారం యథావిధిగా కొనసాగుతాయని అసోసియేషన్ బాధ్యులు మద్ది ప్రభాకర్‌రెడ్డి, గుండాల కృష్ణ, కాటేపల్లి నవీన్ బాబు, కోటా అప్పిరెడ్డి, వి.మోహన్‌రెడ్డి, కిరణ్ శౌరి ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్టీసీకి దసరా ధమాకా



డిపోల వారీగా ప్రయాణికులు, ఆదాయం వివరాలు

డిపో	మహిళలు (లక్షల్లో)	మొత్తం ప్రయాణికులు (లక్షల్లో)	ఆదాయం (రూ.లక్షల్లో)
ఖమ్మం	4.57	7.52	627.26
భద్రాచలం	2.29	4.28	471.9
సత్తుపల్లి	4.49	7.31	459.77
మణుగూరు	3.21	4.76	362.79
మధిర	1.82	3.29	311.16
కొత్తగూడెం	3.27	4.55	287.33
ఇల్లెందు	0.78	1.19	74.32

ఖమ్మం రీజియన్‌కు రూ.25.94 కోట్ల ఆదాయం
- 38.5 లక్షల కి.మీ. మేర బస్సుల రాకపోకలు
- అవిశ్రాంతంగా పనిచేసిన ఉద్యోగులు


ఖమ్మం పాత బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

ఖమ్మంమయూరిసెంటర్: దసరా పండుగ ఆర్టీసీ ఖమ్మం రీజియన్‌కు కనకవర్షం కురిపించింది. పండుగ సమయాన రద్దీ ఉంటుందని ముందుగానే గుర్తించిన అధికారులు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయడమే కాక సమన్వయంతో విధులు నిర్వర్తించడంతో మెరుగైన ఫలితం వచ్చింది. ఖమ్మం రీజియన్‌లోని ఆరు డిపోలకు కలిపి రూ.25.94 కోట్ల మేర ఆదాయం నమోదు కావడంతో ఉద్యోగుల శ్రమకు ఫలితం లభించినట్లయింది.

ప్రత్యేక సర్వీసులు
తెలంగాణలో ఘనంగా జరుపుకునే దసరా పండుగ సందర్భంగా విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడం ఆనవాయితీ. దీంతో కుటుంబాలతో సహా స్వస్థలాలకు రానుండడంతో డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్లతో ఖమ్మం రీజియన్ మేనేజర్ సరిరాం పలు దఫాలుగా సమావేశమయ్యారు. ఈ మేరకు బతుకమ్మ, దసరా పండుగలకు ప్రత్యేక బస్సులను నడిపేందుకు ప్రణాళిక రూపొందించి ఈనెల 1నుంచి 11వరకు హైదరాబాద్ నుండి మధిర, సత్తుపల్లి, భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు ప్రాంతాలకు బస్సులు ఏర్పాటుచేశారు. ఇక పండుగ ముగిశాక తిరిగి వెళ్లే వారి కోసం 13నుంచి 16వ తేదీ వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి హైదరాబాద్, తదితర ప్రాంతాలకు బస్సులు నడిపించారు. మొత్తంగా రీజియన్‌లోని బస్సులే కాక అదనంగా 1,210 బస్సుల(సర్వీసులు)ను నడిపించడంతో ఎక్కడా ఇక్కట్లు ఎదురుకాలేదు.

32.90లక్షల మంది..
ఈనెల 1నుంచి 11వ తేదీ వరకు, ఆపై 13 నుంచి 16వ తేదీ వరకు హైదరాబాద్ నుండి ఉమ్మడి జిల్లాకు, ఇక్కడి నుంచి హైదరాబాద్, తదితర ప్రాంతాలకు బస్సులు 38.5 లక్షల కిలోమీటర్ల మేర రాకపోకలు సాగించాయి. వీటిలో 32.90 లక్షల మంది ప్రయాణికులు ఉండగా.. ఇందులో 20.43 లక్షల మంది మహిళలు ఉన్నారు. మొత్తంగా ఆర్టీసీ ఖమ్మం రీజియన్‌కు రూ. 25.94 కోట్ల ఆదాయం చేకూరింది.

నిర్విరామంగా విధులు
దసరా పండుగ సందర్భంగా ఖమ్మం రీజియన్‌లోని ఏడు డిపోల డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, కార్మికులు, సూపర్‌వైజర్లు, డిపో మేనేజర్లు అవిశ్రాంతంగా విధులు నిర్వర్తించారు. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా బస్టాండ్లలో పర్యవేక్షిస్తూ రద్దీకి అనుగుణంగా బస్సులు ఏర్పాటుచేశారు. ఈమేరకు ఉద్యోగులను అభినందించిన ఆర్‌ఎం సరిరామ్.. ప్రయాణికులకు కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాక రీజి యన్‌కు గణనీయమైన ఆదాయం రావడంతో ఆర్‌ఎం, అధికారులు, సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లను ఎండీ సజ్జనార్ అభినందించారు.

హైడ్రా అంతా ఒక డ్రామా

- ఈ పేరుతో డబ్బు వసూలు చేసే కార్యక్రమం సాగుతోంది..
- కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో నెరవేర్చింది ఒక్కటే
- మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్


మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్, పక్కన నాయకులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రా ఒక డ్రామా అని.. ఈ పేరుతో డబ్బు వసూలు చేసే కార్యక్రమం సాగుతోందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. ఖమ్మంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ ఆర్థిక పరిస్థితి.. ఇప్పటి పరిస్థితి ఏమిటి, ఇతర రాష్ట్రాలకు డబ్బులు ఎలా పంపిస్తున్నారో చెప్పాలన్నారు. కాగా, ప్రభుత్వం కూల్చివేస్తున్నవన్నీ అక్రమ నిర్మాణాలు కావని, బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్రభుత్వ భూములే కాక పట్టా భూములు కూడా ఉంటాయని తెలిపారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన వంటి సీఎం రేవంత్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో ప్రభుత్వ ఆదాయం తగ్గి, హైదరాబాద్‌లో ఎక్కువ ఆదాయం వచ్చే మార్గాలు సన్నగిల్లగా రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొలువుదీరి పది నెలలు కావొస్తుండగా ఆరు గ్యారంటీల్లో ఉచిత బస్సు ప్రయాణం తప్ప మిగతావేవీ అమలు కావడం లేదని పేర్కొన్నారు. ఇప్పటివరకు రైతుబంధు, కౌలురైతుల ఊసే లేదన్నారు. రైతు రుణమాఫీ షరతులు లేకుండా చేస్తామని చెప్పి మాట తప్పడంతో రైతాంగం ఆందోళనలో ఉందని తెలిపారు. ప్రతిపక్షాలుగా తాము ప్రశ్నిస్తే ఎదురుదాడికి దిగుతున్నారని ఆరోపించారు. ఇకనైనా రైతులకు మీరు ఏమి మేలు చేశారో సూటిగా చెప్పడమే కాక హామీల అమలుకు రోడ్ మ్యాప్ ప్రకటించాలని ఈటల డిమాండ్ చేశారు. వరదలతో కోతకు గురై, ఇసుక, రాళ్ల మేటలు వేసిన భూములను సాగు యోగ్యంలోకి తెచ్చేందుకు రూపాయి ఇవ్వలేదన్నారు. ఖమ్మంలో ఇళ్లు మునిగిన బాధితులకు ప్రభుత్వం ఇచ్చిన రూ.16,500 దేనికి సరిపోతాయని ప్రశ్నించారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు తాండ్ర వినోద్‌రావు, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, గల్లా సత్యనారాయణ, శీలం పాపారావు, నంబూరి రామలింగేశ్వరరావు, సన్నె ఉదయ్‌ప్రతాప్, విజయారెడ్డి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భక్త శబరికి స్మృత్యంజలి


వినాయకపురంలో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, చిత్రంలో ఈఓ రమాదేవి


వినాయకపురం గ్రామంలో ఆదివాసీ నృత్యాలతో ఊరేగింపు

- రామాలయంలో ఫల, పుష్పాల సమర్పణ
- గిరిజన గ్రామంలో రామయ్యకు కల్యాణం
- ఏపీలోని శబరి నది వద్ద అర్చకుల అభిషేకం

భద్రాచలం/అశ్వారావుపేట రూరల్: గిరిజన భక్తురాలు, రామయ్యకు ఎంగిలి పండ్లను నైవేద్యంగా సమర్పించి ముక్తిని పొందిన భక్త శబరికి భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా స్మృత్యంజలి నిర్వహించారు. ఏటా అశ్వయుజ మాసంలో పౌర్ణమి రోజున శబరి స్మృతి యాత్ర జరపడం ఆనవాయితీ. ఈ సంవత్సరం భద్రాచలం ఆలయంతో పాటు అశ్వారావుపేట మండలం వినాయకపురంలో గిరిజనుల చెంత స్వామి కల్యాణం జరిపించారు. ఇక ఏపీలోని కూనవరంలో శబరి నది వద్ద గల విగ్రహానికి అభిషేకం చేశారు. ఇలా ఆలయం ఆధ్వర్యంలో ఒకేరోజు మూడు చోట్ల పూజలు జరిపి శబరికి ఘన నివాళులర్పించారు.

గిరి ప్రదక్షిణ, ఫల, పుష్పాంజలి..
భద్రాచలంలో గిరి ప్రదక్షిణతో శబరి యాత్ర ప్రారంభమైంది. అపర భక్తురాలి చిత్రపటంతో మేళతాళాలు, భక్తుల శ్రీరామనామస్మరణల నడుమ ఊరేగింపుగా గిరి ప్రదక్షిణ చేశారు. చప్టా దిగువన ఉన్న తూము నరసింహదాసు, వైకుంఠ ద్వారం వద్ద గల భక్త రామదాసు విగ్రహాలకు పూలమాలలు అలంకరించి హారతి సమర్పించారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వార్లకు, శబరి చిత్రపటానికి పండ్లు, పుష్పాలు సమర్పించారు. అర్చకులు ప్రత్యేక పూజలు జరిపి పుష్పాంజలి ఘటించిన తర్వాత స్వామి వారి నిత్యకల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులకు అర్చకులు వస్త్రాలు సమర్పించి సత్కరించారు. ఆలయ ఏఈఓ భవానీ రామకృష్ణ, ప్రధానార్చకులు విజయరాఘవన్, అర్చకులు, సిబ్బంది, గిరిజన కుల పెద్దలు పూనెం కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అయితే భద్రాచలంలో కనీసం గిరిజన సంప్రదాయ నృత్యాలు, ఆటపాటలు కనిపించకపోవడం లోటుగా భక్తులు భావించారు. ఏటా అట్టహాసంగా జరిగే వేడుక ఈ ఏడాది సాదాసీదాగా సాగడం నిరుత్సాహపరిచింది.

వినాయకపురంలో రామయ్య కల్యాణం..
గిరిజనుల సమక్షంలో అపర భక్తురాలైన శబరిని స్మరించుకునేందుకు ఈఓ రమాదేవి తొలిసారి గిరిజన గ్రామంలో రామయ్యకు కల్యాణం నిర్వహించాలని నిర్ణయించారు. దీనికి అశ్వారావుపేట మండలం వినాయకపురంలోని ముత్యాలమ్మ ఆలయం వేదికగా మారింది. సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్య ఉత్సవ మూర్తులతో వచ్చిన ప్రచార రథానికి గ్రామస్తులు స్వాగతం పలికారు. ఆదివాసీ కొమ్ము నృత్యాలు, గిరిజన సంప్రదాయాలతో ఊరేగింపు జరిపారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించగా ఈఓ స్వామివార్లకు ఫల, పుష్పాలు అందజేశారు.



బహుళజాతి సంస్థలతో ఒప్పందం
బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్, ఆర్థిక సేవలందించే కన్సార్టియమ్ వందకు పైగా బహుళజాతి సంస్థలతో కలిసి పనిచేస్తోంది. ఈ జాబితాలో పలు ప్రముఖ సంస్థలు కూడా ఉన్నాయి. ఈనేపథ్యాన రాష్ట్ర ఉన్నత విద్యా మండలితో కన్సార్టియమ్ ఒప్పందం కుదుర్చుకుంది. ఫలితంగా విద్యార్థులకు చదువుకునే సమయంలోనే ఉపాధి కోర్సులకు సంబంధించి శిక్షణ లభిస్తుంది. దీంతో కాలేజీల నుంచి బయటకు వచ్చాక ఇంకెక్కడికీ వెళ్లాల్సిన పని ఉండదు. శిక్షణ తీసుకునే ప్రతీ 100 మందిలో 50 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు.

చదువుతో శిక్షణ.. ఆపై ఉపాధి

- నూతన విధానానికి ఉన్నత విద్యామండలి శ్రీకారం
- విద్యార్థులకు శిక్షణ కోసం ఒప్పందం
- జిల్లాలో ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాల ఎంపిక
- యువత భవిష్యత్‌కు బాటలు వేయనున్న నూతన విధానం

ఖమ్మం సహకారనగర్: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థుల ఆలోచనల్లో మార్పులు వస్తున్నాయి. ఇందుకు అనుగుణంగా ఉన్నత విద్యా మండలి ద్వారా డిగ్రీ కళాశాలల్లో కొత్త కోర్సులు ప్రారంభిస్తున్న ప్రభుత్వం.. తాజాగా మరో అడుగు ముందుకేసింది. ఉపాధికి కావాల్సిన శిక్షణను చదువుతో పాటే అందించాలని నిర్ణయించింది. తద్వారా కోర్సులు పూర్తయ్యాక శిక్షణ తీసుకునే ఇక్కట్లు తీరడంతో పాటు కళాశాల నుంచి బయటకు రాగానే ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇందుకోసం పలు ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలలను ఎంపిక చేయగా.. జాబితాలో జిల్లాలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలకు స్థానం దక్కడం విశేషం.

నిపుణుల కొరత..
అత్యధిక యువ జనాభా ఉన్న మన దేశంలో వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలు ఉన్నప్పటికీ ఆ స్థాయిలో నిపుణులు లేక ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఈ వ్యత్యాసాన్ని పూరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత పదేళ్లుగా అనేక పథకాలు రచిస్తున్నాయి. ఇందులో భాగంగా రాష్ట్రప్రభుత్వం తాజాగా నైపుణ్యాభివృద్ధి పథకాన్ని రూపొందించింది. ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్న బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ఆర్థిక సేవల రంగా(బీఎఫ్‌ఎస్‌ఐ)లతో కూడిన కన్సార్టియమ్ ద్వారా రాష్ట్రంలోని యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని సంకల్పించింది.

ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ ఎంపిక..
విద్యార్థులకు ఉపాధి శిక్షణ ఇచ్చేలా రాష్ట్రంలో 38 కళాశాలలను ఎంపిక చేయగా.. అందులో ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ఉంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచే కాక మహబూబాబాద్, సూర్యాపేట తదితర జిల్లాల విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. ఈ నేపథ్యాన నైపుణ్యాభివృద్ధి పథకంలో భాగంగా ప్రాథమిక అవగాహన కల్పించగా ఎంపిక చేసిన కళాశాలల నుంచి 10మంది చొప్పున విద్యార్థులను ఆహ్వానించారు. దీంతో ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఉన్నత విద్యామండలి ఆధ్వర్యాన ఆన్‌లైన్ పోర్టల్ ప్రారంభించి వీరిని అందులో నమోదు చేశారు. ఆపై ఉపాధి సంస్థలతో సమన్వయం చేయనుండగా, శిక్షణ పొందిన విద్యార్థులు ఇతరులకు అవగాహన కల్పిస్తూ పోర్టల్‌కు అనుసంధానం చేయడం, నైపుణ్య శిక్షణకు అవసరమైన కార్యక్రమాల అమలులో పాలుపంచుకుంటారు.

ఏం చేస్తారంటే..
డిగ్రీ మూడో సెమిస్టర్ నుంచి ఆరో సెమిస్టర్ వరకు విద్యార్థులను ఎంపిక చేస్తారు. కన్సార్టియమ్ ప్రతినిధులు కళాశాలను సందర్శించి విద్యార్థులను పరీక్ష ద్వారా శిక్షణకు ఎంచుకుంటారు. ఒక్కో దఫా బీఏ, బీకాం, బీఎస్సీ నుంచి 50 మంది విద్యార్థులను ఎంపిక చేస్తారు. అంతేకాక బీఎఫ్‌ఎస్‌ఐ ద్వారా అధ్యాపకులకు శిక్షణ కూడా ఇవ్వనున్నారు. బ్యాంకింగ్, ఫైనాన్స్, సర్వీసెస్, ఇన్సూరెన్స్ రంగాల్లో పరిశ్రమలకు కావాల్సిన విధంగా విద్యార్థులకు శిక్షణ ఇవ్వనుండడంతో కోర్సు పూర్తికాగానే ఉపాధి అవకాశాలు వెల్లువలా వచ్చే అవకాశముంటుందని భావిస్తున్నారు.

తక్షణమే ఉద్యోగ అవకాశాలు


బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ రంగాలకు సంబంధించి శిక్షణతో తక్షణమే ఉద్యోగావకాశాలు లభించే అవకాశముంది. హైదరాబాద్‌లో నైపుణ్యాభివృద్ధి సమావేశంలో పాల్గొన్నాను. మాలాంటి విద్యార్థులకు ఈ అవకాశం దక్కడం ఎంతో ఉపయోగం.
– ఎస్.ప్రభాస్, బీబీఎం కంప్యూటర్స్, చివరి సంవత్సరం

గ్రామీణ విద్యార్థులకు వరం


గ్రామీణ విద్యార్థులకు బీఎస్‌ఎఫ్‌ఐ కన్సార్టియమ్ ద్వారా శిక్షణ ఒక వరమనే చెప్పాలి. పట్టణ ప్రాంత విద్యార్థులతో సమానంగా మేం కూడా పోటీలో ఉండనున్నాం. చదువు ముగిశాక శిక్షణ తీసుకోవాల్సిన పని లేకుండా కోర్సుతో పాటు శిక్షణ అందుతుంది.
– బి.అభినయ్, బీబీఏ, ద్వితీయ సంవత్సరం

బీఎస్‌ఎఫ్‌ఐతో భరోసా


డిగ్రీతో పాటే నైపుణ్యాభివృద్ధికి బీఎస్‌ఎఫ్‌ఐ ద్వారా లభించే అండదండలు భవిష్యత్‌కు భరోసాగా ఉంటాయి. విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. హైదరాబాద్‌లో జరిగిన ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనడం నూతనోత్సాహాన్ని ఇచ్చింది.
– ఎం.చందు, బీబీఏ, ద్వితీయ సంవత్సరం

మహనీయుల చరిత్రను చాటిచెప్పాలి..

వాల్మీకికి నివాళులర్పించిన అదనపు కలెక్టర్ శ్రీజ


వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంసహకారనగర్: మహనీయుల జీవిత చరిత్ర, వారి గొప్పతనాన్ని భవిష్యత్ తరాలకు చేరేలా చాటిచెప్పడం ద్వారా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవచ్చని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ తెలిపారు. మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించాక శ్రీజ మాట్లాడుతూ రామాయణ గ్రంథాన్ని, సమాజానికి విలువలను అందించిన ఆయన మహనీయుడని తెలిపారు. వాల్మీకి జయంతిని అధికారికంగా జరుపుకోవడం సంతోషంగాఉందని చెప్పారు. డీఆర్‌ఓ రాజేశ్వరి, కలెక్టరేట్ ఏఓ అరుణ, వివిధ శాఖల అధికారులతో పాటు బీసీ సంఘాల నాయకులు జక్కుల వెంకటరమణ, షకీనా, కె.ఉపేందర్‌రావు, డి.శ్రీనివాసరావు, ఎం.నరసింహారావు, జి.వెంకటరామయ్య, గజవెల్లి లక్ష్మీవరప్రసాద్, లింగబోయిన పుల్లారావు, కేతనబోయిన నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా డెయిరీ బలోపేతానికి కృషి
ఎర్రుపాలెం: ఇందిరా డెయిరీ బలోపేతం కోసం మరింతగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ శ్రీజ సూచించారు. ఎర్రుపాలెంలోని డెయిరీ యూనిట్, తక్కెళ్లపాడులోని పాల సేకరణ కేంద్రాన్ని పరిశీలించిన ఆమె మాట్లాడారు. ఆతర్వాత మామునూరులో తాగునీటి ప్రాజెక్టును సందర్శించారు. ఎంపీడీఓ సురేందర్, డీపీఎం దర్గయ్య, ఏపీఎం కె.వెంకటేశ్వర్లు, సీసీలు రమాదేవి, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అందుబాటులోకి ప్రకాష్‌నగర్ పాత వంతెన


గురువారం రాత్రి లో లెవల్ వంతెనపై వెళ్తున్న వాహనాలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలో మున్నేటికి గతనెలలో వచ్చిన వరదతో ప్రకాశ్‌నగర్ వద్ద హైలెవల్ వంతెన దెబ్బతిన్న విషయం విదితమే. దీంతో రాకపోకలు నిలిపివేయగా సమీప ప్రాంతాల ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యాన వంతెన మరమ్మతు పూర్తయ్యేవరకు పాత వంతెన(లోలెవల్ వంతెన)పై రాకపోకలకు ఏర్పాట్లు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. దీంతో నీరు వెళ్లేలా పైపులు వేయించిన అధికారులు, ఆపై మట్టి పోయించి గురువారం సాయంత్రం నుంచి వాహనాలను అనుమతించారు. శుక్రవారం నాటికి పూర్తి స్థాయిలో వాహనాలు రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అయితే, లో లెవల్ వంతెన పైనుంచి కేవలం ద్విచక్ర వాహనాలు, ఆటోలు తదితర తేలికపాటి వాహనాలను మాత్రమే అనుమతించే అవకాశముందని సమాచారం.

కరివేద విధానంపై రైతులకు శిక్షణ


డ్రోన్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

కల్లూరురూరల్: వరిలో నేరుగా విత్తనాలు చల్లే పద్ధతి(కరివేద) ద్వారా రైతులకు లాభాలు ఉంటాయని అధికారులు, శాస్త్రవేత్తలు తెలిపారు. మండలంలోని చెన్నూరులో గురువారం రైతులకు శిక్షణ ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య, వరి పరిశోధన కీటక విభాగం టెక్నికల్ ఆఫీసర్ వెంకయ్య కరివేద విధానంపై రైతులకు అవగాహన కల్పించి మాట్లాడారు. ఈ పద్ధతిలో సాగు ఖర్చు తగ్గుతుందని, కూలీల అవసరం కూడా అంతగా ఉండదని తెలిపారు. వీటికి తోడు దిగుబడి పెరుగుతుందని చెప్పారు. ఆతర్వాత వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా డ్రోన్ల వాడకంపై వివరించారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, ఏఓ ఎం.రూప తదితరులు పాల్గొన్నారు.

కొలంబో సదస్సుకు ఖమ్మం యువతి


సాయి ప్రియాంక

ఖమ్మం సహకారనగర్: శ్రీలంకలోని కొలంబోలో జరగనున్న దక్షిణ ఆసియా స్థాయి సదస్సుకు ఖమ్మంకు చెందిన పగడాల సాయి ప్రియాంక హాజరు కానుంది. 'అందరికీ పౌష్టికాహారం' అంశంపై జరిగే సదస్సులో పాల్గొనాలని ఆమెకు ఆహ్వానం అందిందని ప్రియాంక తల్లిదండ్రులు రాజరాజేశ్వరి, నర్సింహారావు తెలిపారు. ప్రస్తుతం ఆమెసంగారెడ్డి జహీరాబాద్‌లోని కేవీకేలో అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ సైంటిస్ట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. యువ మహిళా శాస్త్రవేత్తగా శ్రీలంక ప్రభుత్వ ఆహ్వానం మేరకు డిసెంబర్ 2నుంచి 4వ తేదీ వరకు జరిగే సదస్సులో సాయిప్రియాంక పాల్గొనన్నారు.

అటవీశాఖ కార్యాలయంలో చోరీకి యత్నం

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధి ఇల్లందుల పాడు సమీపాన ఉన్న ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో బుధవారం రాత్రి చోరీ యత్నం జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు కార్యాలయం తాళాలు పగులగొట్టి లోపలకు ప్రవేశించారు. అనంతరం బీరువా తాళాలను సైతం తొలగించి రికార్డులను చిందర వందరగా పడేశారు. గురువారం ఉదయం వచ్చిన సిబ్బంది ఈ విషయాన్ని గుర్తించి అధికారులకు సమాచారం ఇవ్వగా, ఫారెస్ట్ బీట్ అధికారి విజయకుమార్ మధిర టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,400	3,500
మిర్చి	16,900	9,000
మిర్చి తాలు	9,000	6,600
ఏసీ మిర్చి	19,000	14,500
ఏసీ తాలు	9,600	6,800
కొత్త పత్తి	7,000	5,800
పాత పత్తి	7,200	7,150

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.17,043


కొర్రమీను చేపతో వెంకటేష్


చేపల చెరువు

ఆలోచన బాగు.. లాభసాటి సాగు

చదివింది ఎంబీఏ.. ఏ కంపెనీలో చేరినా చెప్పుకోదగిన స్థాయిలో వేతనం పక్కా! కానీ వ్యవసాయంపై ఉన్న ఆసక్తి, తండ్రి ప్రోత్సాహంతో ఆధునిక, వినూత్న విధానాలతో వ్యవసాయం చేస్తున్నాడు ఓ యువరైతు. ఓ పక్క కూరగాయలు పండిస్తూనే.. నాటుకోళ్లు, చేపలు పెంచుతూ లాభాలు అందుకుంటున్నాడు పెద్ది వెంకటేష్. – కూసుమంచి

- కూరగాయల పెంపకంలో రాణిస్తున్న యువరైతు
- మరోపక్క చేపలు, నాటు కోళ్ల పెంపకం
- ఎంబీఏ పూర్తిచేసినా సాగుపై మక్కువ

• నాలుగేళ్లుగా...

కూసుమంచి మండలంలోని ముత్యాలగూడెంకు చెందిన పెద్ది వెంకటేష్ ఎంబీఏ పూర్తిచేశాడు. చదువు పూర్తయ్యాక కొన్నాళ్లు ఉద్యోగం చేయాలని భావించినప్పటికీ... తండ్రి మల్లయ్యను చూస్తూ వ్యవసాయంపై ఆసక్తి పెంచుకున్నాడు. కాస్త మార్పులు చేస్తే లాభాలు వస్తాయని నమ్మిన ఆయన నాలుగేళ్ల క్రితం కూరగాయల సాగుపై దృష్టి సారించాడు. తీగజాతి రకాలైన దొండ, కాకర, సొర, బీర లాంటి కూరగాయలకు పందిళ్లు వేసి ఆధునిక విధానాలు అవలంబించడంతో మంచి దిగుబడులు.. తద్వారా లాభాలు సాధించాడు

• గుడ్లు పొదిగించి నాటు కోళ్ల పెంపకం

వెంకటేష్ తన వ్యవసాయ క్షేత్రంలో వందలాది నాటుకోళ్లను సైతం పెంచుతున్నాడు. ఇందుకోసం మేలైన నాటుకోళ్ల గుడ్లను సమీప గ్రామాల్లో సేకరించాడు. వీటిని ఇంక్యుబేటర్ల ద్వారా పొదిగించి పిల్లలుగా మారాక ప్రత్యేక ఆహారం అందిస్తూ పెంచాడు. ఆపై కోళ్లు మళ్లీ గుడ్లు పెడుతుండగా వాటిని పొదిగిస్తూ పెంచి విక్రయిస్తున్నాడు. నాటు కోళ్లను సోలార్ ఫెన్సింగ్‌తో కూడిన దొండ, ఇతర కూరగాయ పంటల తీగల కింద వదులుతుండడంతో వాటికి సహజసిద్ధమైన మేత లభిస్తోంది. కాగా,


వ్యవసాయ క్షేత్రంలో దొండతోట

కూరగాయలతో పాటు చేపలు, నాటుకోళ్ల పెంపకానికి రూ.8లక్షల వరకు వ్యయమైందని.. కాస్త ఓర్పుగా కష్టపడడంతో మంచి ఫలితాలు వస్తున్నాయని వెంకటేశ్ వెల్లడించాడు.

ప్రత్యేక చెరువులో చేపలు

నాలుగేళ్ల క్రితం అన్ని రకాల కూరగాయల సాగు చేసిన వెంకటేష్ మరింత ఆదాయం కోసం తన ఆలోచనలకు పదును పెట్టాడు. దీంతో నాటు కోళ్లు, చేపలు పెంచాలని నిర్ణయించి 30 కుంటల్లో చేపల సాగు ఆరంభించాడు. ఇందుకోసం పెద్ద చెరువు తవ్వించి బోరు నీరు నింపిన ఆయన కొర్రమీను, గ్యాస్‌కట్, రవ్వు, బొచ్చె, బంగారుతీగ లాంటి మేలు రకాల చేప పిల్లలు వదిలాడు. శాస్త్రవేత్తల సూచనలతో వీటికి ఆహారం సమకూరుస్తుండడంతో చేపలు పెరిగి అమ్మకానికి సిద్ధమయ్యాయి. తద్వారా మంచి ఆదాయం నమోదవయ్యే అవకాశముందని వెంకటేష్ చెబుతున్నాడు.

వచ్చేనెల 15, 16వ తేదీల్లో బాలోత్సవ్


బ్రోచర్లను విడుదల చేస్తున్న నిర్వాహకులు

మధిర: రామభక్త సీతయ్య కళాపరిషత్ ఆధ్వర్యాన మధిరలో నిర్వహించనున్న 27వ జాతీయ బాలోత్సవ్ బ్రోచర్లను కళా పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, బాబ్లా గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మధిర బంజారా కాలనీలోని శ్రీవేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మండపంలో వచ్చేనెల 15, 16వ తేదీల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. తొలిరోజు శాస్త్రీయ, జానపద నృత్యాలు, 16న నీతి పద్యాలు, ఏకపాత్రలు, ఉపన్యాసం, దేశభక్తి గీతాల పోటీలు ఉంటాయని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వచ్చేనెల 10వ తేదీలోగా 'మధిర బాబ్లా, ఇంటి నంబర్ 1-329, బంజారా కాలనీ, మధిర-507 203, ఖమ్మం జిల్లా' చిరునామాకు పంపించాలని, వివరాలకు 94406 75787 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కల్యాణమండపం అధ్యక్ష, కార్యదర్శులు కళ్యాణం పుల్లారావు, నాగిరెడ్డితో పాటు గుండేల ముత్తయ్య, నర్సింహారావు, గడ్డం సుబ్బారావు, శ్రీనివాసు అనంతచార్యులు, వీరారెడ్డి, చీదిరాల సత్యనారాయణ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల క్రికెట్ టోర్నీ ప్రారంభం


బౌలింగ్ చేస్తున్న క్రీడాకారుడు

ఖమ్మంస్పోర్ట్స్: కాకతీయ యూనివర్సిటీ పరిధి ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి డిగ్రీ కళాశాలల క్రికెట్ పోటీలు గురువారం ఖమ్మంలోని ఎస్సార్ అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాలలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, ఖమ్మం జోన్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.వెంకన్న, సీనియర్ పీడీ రఘునందన్, ఎం.డీ.మతిన్, గోపి, శ్రీనివాసులు ప్రారంభించారు. తొలుత కవిత డిగ్రీ కళాశాల – వికాస్ డిగ్రీ కళాశాల మధ్య జరిగిన మ్యాచ్‌లో వికాస్ కళాశాల జట్టు, ఆతర్వాత పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల – కొత్తగూడెం ప్రియదర్శిని డిగ్రీ కళాశాలల నడుమ మ్యాచ్‌లో పాల్వంచ జట్టు విజయం సాధించాయి. ఆతర్వాత ఖమ్మం ఎస్సార్ అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాల – డీఆర్‌ఎస్ డిగ్రీ కళాశాల జట్ల మధ్య మ్యాచ్ జరగ్గా.. ఎస్సార్ అండ్ బీజీఎన్‌ఆర్ జట్టు విజయం సాధించింది.

ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించం


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్

ఖమ్మంవన్‌టౌన్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ తమ ప్రభుత్వం తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం ఇప్పుడే ఏర్పడింది, బుడిబుడి అడుగులేస్తోందని అని చెప్పిన కేటీఆర్ ఇప్పుడు పది నెలలు కూడా గడవకముందే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎందుకు విమర్శిస్తున్నారో చెప్పాలన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన ఆర్థిక విధ్వంసం నుండి రాష్ట్రాన్ని పురోగమనంలోకి తీసుకెళ్లేందుకు సీఎం, డిప్యూటీ సీఎం సహా మంత్రివర్గం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. కాగా, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు కేసుల విషయమై మాట్లాడడం గర్హనీయమని చెప్పారు. గత ప్రభుత్వం ప్రజలు బయటకు వచ్చి మాట్లాడడానికే భయపడ్డారని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్సీలు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, రైతు సంఘం నాయకుడు నల్లమల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సాంకేతిక కారణాలతో ఆగిన రైతుల రుణమాఫీపై రాద్ధాంతం చేయడం తగదన్నారు. కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు దొబ్బల సౌజన్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, బొడ్డు బొందయ్య, షేక్ అబ్దుల్ రషీద్, సత్యాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

ఇండియన్ కిసాన్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సామ్యేల్


మాట్లాడుతున్న సామ్యేల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజాసమస్యలను పరిష్కరించాలని ఇండియన్ కిసాన్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మద్దిశెట్టి సామ్యేల్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం కొత్తగూడెంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రైతుల పట్ల ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి నుంచి ఎమ్మెల్యేల వరకు అందరూ ప్రజలకు పాలేరులేనని, అంకితభావంతో సేవ చేయాల్సిందేనని అన్నారు. కాంగ్రెస్‌లో తన ఎదుగుదలను ఓర్వలేక ఇబ్బందుల పాలు చేయడంతో ఆ పార్టీకి రాజీనామా చేశానని తెలిపారు. రాబోయే సర్పంచ్ ఎన్నికలలో 300 స్థానాల్లో విజయం సాధిస్తామని పేర్కొన్నారు. సభకు మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ హాజరవుతారని నిర్వాహకులు ప్రచారం చేసినా గైర్హాజర్ కావడంతో నిరుత్సాహానికి గురయ్యారు. యూనియన్ జాతీయ నాయకుడు మద్దిశెట్టి అజయ్, ఆలిండియా దళిత మోర్చా కమిటీ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ చిన రాములు, ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు ముక్తి మల్లేష్, స్వర్ణ, బి.రవి, రాందాస్, ఐలయ్య, సమ్మయ్య, రమేష్, అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు, పీఆర్‌సీ తక్షణమే ప్రకటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

కొణిజర్ల: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ ఉన్న ఐదు డీఏలతో పాటు 30 శాతం ఫిట్‌మెంట్‌తో కూడిన పీఆర్‌సీని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ప్రకటించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కొణిజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన యూటీఎఫ్ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. 317 జీఓ బాధిత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు జీఓను ఉపసంహరించుకోవాలన్నారు. కొత్త గురుకులాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. ఎంఈఓ డి.అబ్రహం మాట్లాడుతూ డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులతో ఖాళీలు భర్తీ అయ్యాయని, సమష్టి కృషితో మండలాన్ని జిల్లాలో ఆదర్శంగా నిలపాలని సూచించారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ రంజాన్, నాయకులు యాసా కోటేశ్వరరావు, ఎం.ప్రసాదరావు, ఏ.సుధాకర్, వై.రవికుమార్, వి.దామోదర్, రమణ, లాల్ సయ్యద్, జ్యోతి, జమలయ్య, వీరస్వామి, రామకృష్ణ, భార్గవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోటమైసమ్మతల్లి హుండీ ఆదాయం రూ.7.03లక్షలు


కానుకలను లెక్కిస్తున్న ఉద్యోగులు

కారేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లిలో కొలువుదీరిన శ్రీ కోటమైసమ్మతల్లి జాతర దసరా నుంచి బుధవారం వరకు కొనసాగింది. ఈసందర్భంగా హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం దేవాదాయ శాఖ అధికారి అనిల్ కుమార్ పర్యవేక్షణలో లెక్కించారు. ఆరు హుండీల్లో కలిపి రూ.7,03,006 ఆదాయం నమోదు కాగా, గత ఏడాదితో పోలిస్తే రూ.7వేలు అదనమని ఈఓ వేణుగోపాలాచార్యులు తెలిపారు. కాగా, ఈనెల 21వ తేదీ వరకు భక్తుల రద్దీ ఉంటుందని ఆతర్వాత మరోమారు హుండీల్లో కానుకలు లెక్కించి, వేలం పాటల వివరాలతో సహా జాతర ఆదాయాన్ని ప్రకటిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పర్సా ట్రస్టు చైర్మన్ పర్సా పట్టాభిరామారావు, ఆలయ ఉద్యోగులు పగడాల మోహన్‌కృష్ణ, పర్సా లలిత్ సాయి, మాజీ సర్పంచ్ బానోతు బన్సీలాల్ పాల్గొనగా పోలీసులు బందోబస్తునిర్వహించారు.

క్రీడాపోటీలకు ముస్తాబైన కిన్నెరసాని

నేడు పోటీలను ప్రారంభించనున్న కలెక్టర్, ఐటీడీఏ పీఓ


క్రీడాపోటీల నిర్వహణకు లైనింగ్ కోసం ముగ్గుపోస్తున్న విద్యార్థులు


పీడీలు, పీఈటీలకు సూచనలు చేస్తున్న డీడీ మణెమ్మ

పాల్వంచరూరల్: పాల్వంచ మండలంలోని కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్‌లో భద్రాచలం ఐటీడీఏ స్థాయి గిరిజన పాఠశాలల క్రీడాపోటీలు శుక్రవారం నుంచి రెండు రోజులపాటు జరగనున్నాయి. ఈ మేరకు స్పోర్ట్స్ స్కూల్ మైదానంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. పోటీలను కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్ ప్రారంభిస్తారని, ఉమ్మడి జిల్లాలోని 70 పాఠశాలల నుంచి 800మంది బాలబాలికలకు హాజరవుతారని జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాల్‌రావు తెలిపారు. కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, ఆర్చరీ, చదరంగం, క్యారమ్స్ విభాగాల్లో తొలిరోజు బాలికలకు, రెండో రోజు బాలురకు పోటీలు నిర్వహిస్తారు. ఈ మేరకు ఏర్పాట్లను గురువారం ఐటీడీఏ డీడీ మణెమ్మ పరిశీలించి సూచనలు చేశారు. ఏటీడబ్ల్యూఓ చంద్రమోహన్, పాఠశాల హెచ్‌ఎం ఎల్.రామారావు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

పిల్లలతో పనులు

పోటీల నిర్వహణ ఖర్చులకు ఐటీడీఏ నుంచి రూ.50వేలు మంజూరయ్యాయి. ఈ నిధులతో మైదానాన్ని చదును చేయించడం, క్రీడల వారీగా ఏర్పాట్లు చేయడంతో పాటు ముగ్గు పోయించడం వంటి పనులకు కూలీలను నియమించుకోవాలి. కానీ ఏర్పాట్ల బాధ్యతలు నిర్వర్తిస్తున్న పీడీలు, పీఈటీలు గురువారం మైదానంలో విద్యార్థులతో ముగ్గు పోయించడం తదితర పనులు చేయించడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

రాష్ట్రస్థాయి పోటీలకు ఆహ్వానం

కొత్తగూడెంటౌన్: రాష్ట్రస్థాయిలో ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్పీ రోహిత్‌రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే) సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్నామని, పోలీసుల త్యాగాలు, విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా తీసిన మూడు ఫొటోలు, మూడు నిమిషాల నిడివి కలిగిన షార్ట్‌ఫిల్మ్ తీసి పంపాలని కోరారు. వీటిని ఈ నెల 20 తేదీ లోపు జిల్లా పోలీసు కార్యాలయంలో పీఆర్‌ఓకు అందజేయాలని కోరారు. 'మూఢ నమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో పోలీసు సేవ, ఇతర సందర్భాల్లో పోలీసులు కీర్తి ప్రతిష్టలు, సైబర్ నేరాలు ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, మత్తు పదార్థాల సేవనంతో అనర్థాలు'అంశాలపై 2023 అక్టోబర్ నుంచి ఇప్పటివరకు తీసిన ఫొటోలు, షార్ట్‌ఫిల్మ్ మాత్రమే పంపించాలని కోరారు. వివరాలకు 87126 82121లో సంప్రదించాలన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

నేలకొండపల్లి: మండలంలోని చెన్నారంలో గురువారం ఇంటింటికీ తిరిగి కొనుగోలు చేసిన ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బియ్యం కొనుగోళ్లు, తరలింపు స్థానికులు ఇచ్చిన సమాచారంతో చేరుకున్న పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈమేరకు ఆటో, బియ్యంను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సాగర్ కాల్వలో గుర్తుతెలియని మృతదేహం


మృతదేహాన్ని తీసుకొస్తున్న శ్రీనివాసరావు, తదితరులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని గోపాలపురం పవర్ ప్లాంట్ సమీపాన సాగర్ ప్రధాన కాల్వలో గుర్తుతెలియని వ్యక్తి(30) మృతదేహాన్ని గురువారం గుర్తించారు. కాల్వలో మృతదేహం తేలుతుండగా స్థానికులు ఖమ్మం అర్బన్ పోలీసులను సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు, ఫైర్ సిబ్బంది సమక్షాన అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు తన బృందంతో కలిసి మృతదేహాన్ని తీసి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చింతకాని: మండలంలోని మత్కేపల్లికి చెందిన రెడ్డిబోయిన రాంబాబు(31) పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆయనకు పదేళ్ల క్రితం వివాహం జరగగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో మూడేళ్ల క్రితం పెద్ద మనుషుల సమక్షాన విడిపోయారు. ప్రస్తుతం ఒంటరిగా ఉంటున్న రాంబాబు మద్యానికి బానిసై బుధవారం మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగాడు. అపస్మారక స్థితికి చేరిన ఆయనను ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందగా రాంబాబు తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

చెత్త ట్రాక్టర్ పైనుండి పడిన కార్మికురాలు


గాయపడిన కార్మికురాలు సంధ్య

ఖమ్మంమయూరిసెంటర్: చెత్త సేకరణ ట్రాక్టర్ పైనుండి మహిళా పారిశుద్ధ్య కార్మికురాలు కింద పడడంతో గాయాలయ్యాయి. ఖమ్మం 32వ డివిజన్ పరిధిలో కార్మికులు చెత్త సేకరిస్తుండగా ట్రాక్టర్‌పైన ఉన్న కార్మికురాలు సంధ్య వారి నుంచి బుట్టలు తీసుకుని ట్రక్కులో వేస్తోంది. ఈక్రమాన బుట్టను అందుకునే క్రమంలో ప్రమాదవశాత్తు కింద పడగా గాయాలయ్యాయి. దీంతో సహచర కార్మికులు ఆస్పత్రికి తరలించి శానిటరీ సూపర్‌వైజర్, ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. కాగా, ఆమెకు మెరుగైన వైద్యం అందేలా పర్యవేక్షించాలని జవాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు అధికారులకు సూచించారు. అయితే, సంధ్య తలకు బలమైన గాయం కావడంతో చికిత్స కొనసాగుతోంది.

ఇది రెండో ఘటన

ఆగస్టు 13న ఓ కార్మికుడు ట్రాక్టర్ పైనుండి కింద పడి మరణించాడు. ఇప్పుడు మహిళా కార్మికురాలు గాయాలపాలైంది. వృద్ధులు, మహిళా కార్మికులను ట్రాక్టర్‌పైకి ఎక్కించవద్దని కోరుతున్నా పట్టించుకోవడం లేదని, జవాన్లు కావాలనే ఇలా చేస్తున్నారని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. కదిలే ట్రాక్టర్‌పై ఉండి చెత్త సేకరించడం ఇబ్బందిగా ఉంటున్నందున వృద్ధులు, మహిళలకు ఈ పని కేటాయించొద్దని కోరుతున్నారు.

కారు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

కల్లూరు: తిరువూరు నుంచి కల్లూరుకు వస్తున్న కారు వేగంగా దూసుకొచ్చి కల్లూరు మండలం పేరువంచ వద్ద బుధవారం రాత్రి పాదచారులను ఢీకొట్టడంతో ఏడుగురు గాయపడిన విషయం విదితమే. ఇందులో మంచాల చిన్న నర్సయ్య ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కాగా, ప్రమాదానికి కారణమైన డ్రైవర్ మార్తా వేలాద్రిని పోలీసులు అరెస్ట్ చేశారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

బోనకల్: మండలంలోని నారాయణపురంలో గురువారం విద్యుత్ షాక్‌తో ఓ పాడిగేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు నంబూరి వెంకటేశ్వర్లు పాడిగేదె పొలంలో మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో షాక్‌కు గురై మృత్యువాత పడింది. రూ.లక్ష విలువైన గేదెను కోల్పోయిన తనను ఆదుకోవాలని రైతు కోరాడు.